# కూడి ఎడమైతే

రామినేని ఫణి

**రామారావ్** ఆ రోజు ఆఖరిసారిగా నిశ్చయించుకున్నాడు, ఆత్మహత్య చేసుకోవాలని. గతంలో చాలాసార్లు చేసుకోవా అనుకున్నాడు కానీ చేసుకో లేదు. ఈ రోజు ఖచ్చితంగా ఆరు నూరైనా, నూరు ఆరైనా, ఆకాశం ఫెటేలుమని పగిలిపోయినా, భూమి తలక్రిందులైనా సరే ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు.

రామారావ్ నిరుద్యోగి కాదు!

అతనికి పెళ్ళి చేయాల్సిన చెల్లెళ్ళు, పైకి తీసుకురావాల్సిన తమ్ముళ్ళు, మంచంలో రోగిష్ఠి తల్లి లేరు. కానీ చాలీ చాలని జీతంతో భార్య కోర్కె తీర్చలేని భర్తగా, కొడుక్కి టైఫాయిడ్ వస్తే మందులు ఇప్పించలేని తండ్రిగా మాత్రం రామారావ్ ఉన్నాడు.

ఒకప్పుడు రామారావ్ వెలిగిపోతుండేవాడు. జీవితంలో కష్టముంటుందని, కడుపు చించుకుంటే కాళ్ళమీద పడే బాధలుంటాయని రామారావ్‌కి తెలీదు. అలా తెలీకుండా, అతని తండ్రి అలా పెంచాడు. రామారావ్ తండ్రి లక్షాధికారి, భిక్షాధికారి కాదు. ఓ మధ్య తరగతి కుటుంబీకుడు.

ఒక్క కొడుకే కావటంతో, ఆ కొడుక్కి తల్లి లేకపోవటంతో, అల్లారు ముద్దుగా, కంటికి రెప్పలా పెంచాడు. కొడుకు కోరింది తెచ్చి ఇచ్చాడు.

కాలేజీలో మడత నలగని బెల్ బ్యాటమ్ ప్యాంట్‌తో, నోట్లో అతి ఖరీదైన సిగరెట్‌తో జీవితం పచ్చగా, సునీతతో కలిసి కూర్చునే కాలేజీ పార్క్ లోని పచ్చికలాగా, అప్పుడే పూసిన గులాబీలాగా మృదువుగా, అందంగా, పచ్చగా ఉంటుందని, ఉండాలని నమ్మేవాడు.

హటాత్తుగా తండ్రి గుండెపోటుతో పోయాడు.

రామారావ్ కలల రాకెట్ భూమ్మీద పడిపోయింది.

తండ్రి వెనక ఆస్తికి మించినఅప్పులు అప్పులు తర్వాత నడిరోడ్డుమీద రామారావ్ నిల్చోవలసి వచ్చింది.

అప్పుడే రామారావ్‌కి రెండు ముఖ్యవిషయాలు గుర్తొచ్చాయి.

ఒకటి తను పూర్తి చేయని డిగ్రీ.

తను ప్రేమించిన సునీత రెండవది.

సునీతమాత్రం ఈ ఒంటరి రామారావ్‌ని వీధిపక్క 'డస్ట్‌బిన్'లా చూసేసరికి రామారావ్‌కి ప్రేమ ప్రేమలా కాకుండా పాములా కన్పడింది. రామారావ్‌కి ప్రపంచమంటే ఏమిటో బోధపడింది. తాను బ్రతకాలి, ఇదివరకులా తనకు అడక్కుండా డబ్బు పంపే తండ్రి లేడు. ఇదివరకులా తను బాధ్యతలు లేకుండా ఉండటానికి తన కడుపులో ఆకలి వూరుకోదు.

ఒక్కసారిగా తాను ప్రపంచంలో అప్రయోజకుడైనట్లు అనుకున్నాడు.

ప్రయోజకుడు కావాలంటే ఉద్యోగం కావాలి. ఉద్యోగం ఉంటే డబ్బుంటుంది. డబ్బుంటే ఆకలిని పాత మార్చి పారవేయవచ్చు.

విజయవాడ ప్లాట్‌ఫారమ్‌ల మీద తిరిగాడు. వీధులమ్మట వేరుశనక్కాయలు తింటూ తిరిగాడు. గాంధీ కొండ మీద నుంచి విజయవాడను చూస్తూ భవిష్యత్తును వూహించుకొనేవాడు.

తాను ఒంటరి. తన కెవ్వరూ లేరు. ఉన్నా వాళ్ళు పట్టించుకోరు. ఏం చెయ్యాలి ఎవరు ఉద్యోగం ఇప్పిస్తారు.

ఒక రోజు దుర్గ గుడికి వెళ్ళాడు.

దుర్గ రామారావ్ ప్రార్థనలు విన్నదో లేదో కాని, రామారావ్ మేనమామ ఒకాయన అరిగిపోయిన చెప్పులతో నీరసంగా దుర్గ గుడి మెట్ల మీద కూచుని నిట్టూరుస్తున్నప్పుడు రామారావ్ కనిపించాడు.

రామారావ్ ఆయన్ని అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. ఆయన రామారావ్‌ను చూసి పేదకు పెన్నిధి దొరికినట్లు సంబరపడిపోయాడు.

రామారావ్ తల్లికి వేలువిడిచిన తమ్ముడు ఈ మేనమామ.

రామారావ్‌ను చూడగానే "ఏం చేస్తున్నావు, బాబూ" అన్నాడు. రామారావ్ ఆకాశంకేసి, భూమికేసి, విజయవాడ రోడ్లకేసి చూసి "దేశసేవ" అన్నాడు.

"అదేమిటి ఉద్యమమైనా రాజకీయాల్లో ప్రవేశించావా?"

"ఆ ... ఆ ... మనకు అదొక్కటే తక్కువ, మామయ్యా! ఉద్యోగం కోసం వూరంతా తిరుగుతున్నాను. ఉద్యోగం దొరికితే దేశానికి సేవ చేయొచ్చు."

ఆమామయ్య రామారావ్‌ను పైనుంచి కిందికి చూశాడు.

ఆయన కేదో స్ఫురించింది.

"ఇంతకూ ఉద్యోగం దొరికిందా?" అని అడిగాడు.

"దొరికితే దుర్గ గుడి కెందుకు వస్తాను."

"సరే. నాతో రా" అన్నాడు. ఎక్కడికీ, ఏమిటి అని ప్రశ్నించలేదు. నరాసరి హోటల్‌కు వెళ్ళారు. రామారావ్‌కి రాత్రెప్పుడో తిన్న శనక్కాయలు, ఉదయం తాగిన 'టీ' తప్ప కడుపులో ఏమీ లేదు. ఇప్పుడైనా కనీసం నాలుగు రోజుల గ్రాసం పొట్టలో వెయ్యాలని ఆ హోటల్లో ఉన్న పదార్థాలు ఒక్కొక్కటే తెప్పించాడు. చిద్విలాసంగా నవ్వుతున్న మామయ్యను చూసేసరికి తన పెంపుడుకుక్కకు మాంసంముక్కలు వేసి ఆనందించే లక్షాధికారిలా కనిపించాడు.

'అవును—అవేమిటి? ... ఇలా తినెయ్యట మేమిటి? తనకు ఆత్మాభిమానం, పరువు, మర్యాద లేవా?' అని అర క్షణం ఆలోచించి 'ఏదైనా ఆకలి తరవాతే కదా' అని టిఫిన్ లాగించాడు. బయటి కొచ్చి కిళ్ళీ బుగ్గన పెట్టి సిగరెట్ వెలిగించేసరికి ఆ ఆనందం ముందు బ్రహ్మ పదవి కూడా దీటు కాదనిపించింది.

ఇద్దరూ ప్రకాశం బ్యారేజి చేరుకున్నారు.

"బాబూ, రామారావ్! నేను నీకు ఉద్యోగం ఇప్పిస్తాను" అని మామయ్య అన్నాడు.

రామారావ్‌కి ఆశ్చర్యమేసింది. వూరంతా తిరిగి, అడ్డమైన గాడిదల కాళ్ళు పట్టుకున్నా దొరకని ఉద్యోగం మామయ్య ఇప్పిస్తానంటున్నాడు.

"నిజంగా!"

"నిజం, నిజం" అని రెండుసార్లు గట్టిగా అన్నాడు.

ఆ క్షణంలో మామయ్య వైకుంఠ వాసుడిలాగా, బ్యారేజీ మీద వెలసిన మినీస్వైజు దేవుడిలాగా కనిపించాడు. అలా తన్మయత్వంలో మునిగి తేలుతున్న రామారావ్‌ని గట్టిగా కుదిపి—

"రేయ్, నీకు లక్ష్మి తెలుసా?" అన్నాడు.

"ఏ లక్ష్మి ... ధనలక్ష్మి, గజలక్ష్మి ... సుబ్బలక్ష్మి!"

"అదేరా నీ మరదలు—మా అమ్మాయి లక్ష్మి ... గుర్తుందా?"

"గుర్తులేదు, మామయ్యా" అన్నాడు రామారావ్.

"సరే, మన వూరు వెళదాం రా" అన్నాడు.

ఎందుకు, ఏమిటి అని ప్రశ్నించకుండా బయల్దేరాడు రామారావ్. కానీ మనస్సులో ఒక అనుమానం ఉంది. కొంపదీసి లక్ష్మిని తన కిచ్చి పెళ్ళి చెయ్యడు కదా ఈ ముసలిపీనుగ అనుకున్నాడు.

రామారావ్‌కు ఉద్యోగం లేదు.

తన కూతురికి పెళ్ళి కాలేదు!

"టూ బర్డ్స్ అట్ ఎ షాట్."


ఇటు కట్నం లేకుండా కూతురు పెళ్ళి చేయబోతున్నాడు తను.

రామారావ్ అనుమానం నిజమైంది. లక్ష్మితో పెళ్ళి నిశ్చయమైంది.

తాను మోసపోతున్నానేమో అనే అనుమానం మొదట వచ్చినా, లక్ష్మిని చూసేసరికి ఆ అనుమానం పోయింది.

ఇంత అందాల బొమ్మకోసం మోసపోయినా ఫర్వాలే దనిపించింది.

వారం రోజులు గడిచిపోయాయి. నెల రోజులు గడిచాయి. మూడు నెలలు మూడు క్షణాల్లా కదలి వెళ్ళిపోయాయి. లక్ష్మి కళ్ళలో స్వర్గం ఉందా, లేదా! లక్ష్మి అధరంలో అమృతంలో




కీపి ఎంత ఉంది, ఆమె బుగ్గల్లో కెంపులు ఎలా పూస్తాయి, ఆమె కురుల్లో నీలాల మణులెలా ప్రకాశిస్తాయి అనే వాటి మీద రామారావ్ రిసెర్చి చేస్తుండగా వో రోజున రామారావ్‌కు అనుమానం వచ్చింది. తన మామగారు తనకు ఉద్యోగం ఇప్పిస్తాడా, లేదా అని వెళ్ళి అడిగాడు.

''మామయ్యా. నా ఉద్యోగం?''

''చూద్దాం.'' అన్నారు.

''నా సొంతకాళ్ళ మీద నేను నిలబడాలి.''

''అలాగే ఉద్యోగం వేయిస్తాను'' అన్నారు ఆ మామగారు.

అంతే. రామారావ్ మరి మాట్లాడలేదు.

ఆ రెండో రోజు వో కాగితం రాసి ఇచ్చాడు.

దానితో విజయవాడ వెళ్ళి ఆ కాగితం తాలూకు పెద్దమనిషికి ఆ కాగితం ఇచ్చాడు. ఆ పెద్దమనిషికి వో ఫర్మ్ ఉంది. దాన్లో పది మంది క్లర్కులు, ఇద్దరు స్టెనోలు ఉన్నారు.వో బంట్రోతు, రెండు అంబాసడర్ కార్లు ఉన్నాయి.

రామారావ్‌కి ఉద్యోగం వచ్చింది. లక్ష్మి అతని ఇంటి కొచ్చింది. గొడ్డు చాకిరీ అనేది అనుభవంలోకి వచ్చింది. జీవితం ఇంత త్వరగా వారో అయిపోతుం దని రామారావ్ భావించలేదు. వచ్చే రెండు వందల రూపాయలతో కాపురం ఈదాలంటే బ్రహ్మప్రళయమంత పనైంది.

జీవితంలో తానెంత ఘోరంగా మోస పోయిందీ రామారావ్‌కి తెలిసొచ్చింది. కట్నం లేకుండా తన భార్యను జీవితాంతం ఎలా పోషించ గలడు తాను? అంతలోనే ఫర్వాలేదు, నేనో అభ్యుదయవాదిని కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాను అని స్థిమితపడ్డాడు.

మరో సంవత్సరంలో ఆ ఇంట్లోకి మూడో ప్రాణి వచ్చింది.

ఆ ప్రాణికి అన్న ప్రాసనచేసి నామకరణం చేసి 'సుదర్శనం' అన్నారు.

సుదర్శనానికి అయిదేళ్ళొచ్చాయి.

రామారావ్‌కి జీతం మారింది. అంతకు మించి అవసరాలు పెరిగాయి. తన కన్న ప్రపంచంలో నిరుద్యోగి హాయిగా ఉన్నాడు. తను మాత్రం సమస్యలతో, నెల నెలా అప్పులతో టక్కా చిక్కి పోతున్నాడు.

పాలవాడికి రెండు నెల్ల 'బాకీ' ఉంది.

తన కడుపులో తన ప్రాణం తీసే 'అల్సర్' ఉంది.

సుదర్శనానికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది.

జీవితం చాలా ఇరుగ్గా, ఇక ముందుకు పోలేము అన్నట్లుగా ఉంది.

సాయంకాలమైంది. రామారావ్ ఆఫీసు నుంచి బయటికి వచ్చాడు.

ఉదయం భార్యామణి చెప్పిన మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

"సాయంకాలం మందు తీసుకు రండి..."

మందు తీసుకు రావాలంటే డబ్బు కావాలి—డబ్బు కోసం అప్పు చెయ్యాలి. అందర్నీ అడిగాడు. పాపం! అందరూ తన లాంటి వారే! ఆఖరుకు బంట్రోతునుకూడా—వెధవ! తాను వాడికన్నా లోకువై పోయాడు. పోయిన నెల బాకీ తాను తీర్చలేదంట. అది తీరిస్తే అప్పు ఇస్తానన్నాడు వాడు. తన జీతం అడ్వాన్సుగా తీసేసుకున్నాడు.

మందు లేకపోతే సుదర్శనం బతకడు.

మందు లేకపోతే లక్ష్మి ఏడుస్తుంది.

"ఏమండీ, ఒక్కగానొక్క కొడుకు—వాడికి రోగం రొష్టు వస్తే నయం చేయించాల్సిన బాధ్యత మీ కుంది. ఏదో విధంగా సాయంత్రానికి మందులు తీసుకురండి."

పిచ్చి లక్ష్మి! లక్ష్మికి తెలుసు డబ్బు లేదని, దొరకదని— కానీ పేగు బంధం వూరుకుంటుందా?

అయినా లక్ష్మికి తనేం చెయ్యగలిగాడు? తన బాధల్ని, కష్టాల్ని ముప్పావు పంచుకుంటూంది లక్ష్మి.

ఆలోచనలు ఆగిపోయాయి. ఇల్లు దగ్గరయింది. ఇంట్లోకి వెళ్ళాడు. లక్ష్మి సుదర్శనం మంచం పక్క శోకదేవతలా ఉంది.

"మందు తెచ్చేరా? బాబుకి హార్లిక్స్ తెచ్చారా?"

"లేదు" అన్నాడు రామారావ్.

"లేదా?" అని ఒక నిట్టూర్పు విడిచి రామారావ్ వంక చూసింది.

ఆ క్షణంలో రామారావ్ పాతాళానికి కుంగిపోయాడు.

రామారావ్‌లో ఒక నిర్ణయం రూపు దాల్చింది.

తనీ బతుకు బతక లేడు. తను చచ్చిపోవాలి— చచ్చిపోవాలి. కాగితం తీసుకున్నాడు. గుండె అదిరింది. దాని మీద రాశాడు.

"లక్ష్మీ! ఈ అసమర్థపు బతుకు బతకలేను. జీవితాన్ని చక్కదిద్దుకోలేని అప్రయోజకత్వం నన్ను నిలేసి ప్రశ్నిస్తోంది. అందుకే నేను చచ్చిపోతున్నాను. నేను చచ్చిపోతే వచ్చే ఎల్. ఐ. సి., ప్రావిడెంట్ ఫండ్‌లతో బాబును బతికించుకో—నీ రామారావ్!"

బల్లమీద కాగితాన్ని పెట్టి బయటికి వచ్చాడు. అతని కిప్పుడు మనస్సంతా ఆనందంగా ఉంది.

'ప్చ్! ఎంత విచిత్రం! మనిషి బతుకులోకి ఒంటరిగా వస్తాడు. పోయేటప్పుడు ఒంటరిగా పోతాడు. మధ్యలోనే ఇన్ని బంధాలు, కష్టాలు, కన్నీళ్ళు. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నాడు. జీవితంలో నుంచి పారిపోతున్నాడు. తాను జీవితంలోనుంచి పారిపోతున్నాడా?'

ఒక్క క్షణం ఆలోచించాడు రామారావ్.

'లేదు. తను జీవితం నుంచి పారిపోవడం లేదు. జీవితం నుంచి సెలవు పుచ్చుకుంటున్నాడు. తానీ బతుకు బతకలేడు. అనుక్షణం చస్తూ బతికే బతుకు కంటే ఒక్క క్షణం నిజంగా చనిపోవటం నయం.

ఆత్మహత్య చేసుకోవటానికి చాలా ధైర్యం కావాలి.

అన్ని కోరికల్నీ, అనుభూతుల్నీ, అనుభవాల్ని ఒక్క క్షణంలో తెంచేసుకోవాలి. రేపు ఉదయానికి సూర్యుడు ఉదయిస్తాడు. ఆ సూర్యుడ్ని తాను

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

వ్యాపారంలో పెట్టుబడి మాత్రం పెట్టి, ఊరికే ఉండిపోయే భాగస్వామి స్లీపింగ్ పార్ట్‌నర్. తనశక్తియుక్తులతో వ్యాపారాన్ని నడుపుతూ ఉండేవాడు యాక్టివ్ పార్ట్‌నర్.

పెళ్ళికూడా ఒక వ్యాపారం అయిపోయిన ఈ రోజుల్లో స్త్రీ తనకంటూ ఒకవ్యక్తిత్వం లేకుండా, తోలుబొమ్మలా భర్త ఆడించినట్లు ఆడుతూ, గాలికోడిలా అతని మూడ్సుకి తగినట్లు తిరుగుతూ, కేవలం పడక సుఖం మాత్రమే అందించే 'స్లీపింగ్ పార్ట్‌నర్' గా మిగిలి పోతోందా?...

ఈతరం అమ్మాయిల సమస్యలకి అద్దం పట్టే నవల.

వెన్నెలమెట్లు

రచన: మైనంపాటి భాస్కర్

త్వరలో ప్రారంభం!

చూడలేదు. పాలవాడి కేకల్ని వినలేదు. మేనేజరు తిట్లు తినలేదు. మళ్ళీ రేపు పూలు పూస్తాయి. ఆకాశవాణిలో వార్తలు ప్రసారం అవుతాయి. పేపర్లో ఒక మూల తన ఆత్మహత్య గురించి వ్రాయబడి ఉంటుంది.

"అయ్యో! రామారావ్ చచ్చిపోయాడా! రామారావ్ చచ్చిపోతే ప్రపంచం ఇంకా మిగిలే ఉందే! మనుష్యులు ఇంకా మోసాలు చేస్తున్నారే" అని ఎవ్వరూ ఆశ్చర్య పడరు. రోజు జరిగే పనులు అన్నీ జరిగిపోతాయి. కానీ ఈ ప్రపంచంలో తాను ఉండడు. తన నవ్వులు, తన ఏడ్పులు, తన సుఖాలు, తన కష్టాలు—ఏం సాధించాడు? ఎందుకు చచ్చి పోయాడు. సభలు, శ్రద్ధాంజలులు ఏవీ ఉండవు. పనికిరాని ఒక మనిషి, ఎవ్వరికీ తెలీని ఒక సగటు మనిషి చచ్చిపోయాడంతే!'

'రామారావ్ అలాగే నడుస్తున్నాడు. వీధి దీపాలు అలవాటు ప్రకారం డిమ్‌గా వెలిగాయి.

రేడియో మోగుతూంది!

"పార్లమెంట్ రద్దు చేయబడింది, మధ్యంతర ఎన్నికలు. ఈ ఎన్నికల్లో జనతా, కాంగ్రెస్‌ల మధ్య పోటీ బలంగా ఉంటుందని అభిజ్ఞ వర్గాలు విశ్వసిస్తున్నాయి.

జనతా! కాంగ్రెస్! ఎవరు వస్తే నేం! తన బతుకు మారదు. తన లాంటి సగటు మానవుడి, కష్టాలు, బాధలు ఏవీ మారవు. తన లాంటి వాళ్ళు ఆత్మహత్యచేసుకుంటారు. జనాభా పెరుగుతూనే ఉంటుంది. గోడమీద రాసిన స్లోగన్ చూశాడు.

"శ్రమయే వ జయతే..."

"చెట్లు నాటండి, వరకట్నం బహిష్కరించండి.." యువజన కాంగ్రెస్

చెట్లు దేశంలో ప్రజలకి నీడని ఇస్తాయి. తను చెట్టు లాంటివాడు. తన భార్యా పిల్లలు ఆ చెట్టు కింద సేద తీర్చుకుంటున్నారు. కానీ ఈ చెట్టు కూలి పోతుంది. నటించి పోతుంది.

దూరంగా ఆఫీసు కనిపిస్తూంది. ఆఫీసు గ్లాస్ డోర్స్ మీద స్ట్రీట్ లైట్ కాంతి పడి మెరుస్తూంది. ఈ ఆఫీసులో తన లాంటి బడుగు జీవాలు పడి ఉన్నాయి. తన బతుకును, సారాన్ని సుఖాన్ని ఈ ఆఫీసే పీల్చి పిప్పి చేసింది. తన వాళ్ళకు తాను ఆనందం కలిగించాలి కాలికి కంకరరాయి తగిలింది. ఆ రాతిని వంగి తీసుకుని బలంగా ఆఫీసు గ్లాస్ డోర్స్ మీదకు విసిరాడు. భళ్ళున అద్దం పగిలింది. నిద్ర పోతున్న గూర్ఖా లేచాడు.

"కౌన్ హై!"

రామారావ్ సంతృప్తిగా నవ్వు కున్నాడు. మరో వీధిలోకి తిరిగాడు.

'వెధవ పొద్దున్నే చూసి లబో దిబో మంటాడు. మిగతా వాళ్ళందరికీ ఆనందంగా ఉంటుంది. రెండు వేలు ఖరీదు చేస్తుంది ఆ గ్లాస్.

మళ్ళీ నడక సాగించాడు! ఆకాశంలోకి చూశాడు. నక్షత్రాలు నవ్వుతున్నాయి. చంద్రుడు మబ్బుల్లో నుంచి బయటికి వచ్చాడు.

వీధుల్లో జనం లేరు.

"హోహో. హో. హో" అని పెద్దగా అరిచాడు. చెట్టుమీద కాకి భయపడి ఎగిరి పోయింది. నిద్ర పోతున్న వీధి కుక్క ఒక్కసారి 'భౌ' మంది.

"హోహో సీ. నీక్కూడా నేం లోకువయ్యానా" అని అనుకున్నాడు.

తాను చచ్చిపోతున్నాడు. అవును, తాను చచ్చిపోతున్నాడు. ఇంకొన్ని గంటల్లో చచ్చిపోతాడు.

"డెత్ యీజ్ ఇనెవిటబుల్ చావు తప్పదు. దాన్ని తప్పించుకోవటం ఎవ్వరికీ చేతకాదు. చచ్చి పోయేవాడికి తీరని కోర్కె లుంటాయి. తనకు అన్నీ తీరని కోర్కెలే. ఏ కోర్కె తీర్చు కోవాలి తన కిష్టమైన సిగరెట్ కాల్చాలి. జేబులు కెలికాడు. చిల్లరుంది. దూరంగా టీ బంక్ కనిపిస్తూంది. బంక్ దగ్గిరికి వెళ్ళి టీ తాగాడు. నరాల్లో కొత్త శక్తి వచ్చింది. పక్కనే కిళ్ళీ కొట్టులో సిగరెట్లు రెండు తీసుకున్నాడు.

ఒక సిగరెట్ వెలిగించాడు.

గట్టిగా, గాఢంగా పీల్చాడు. గుండె లోకి వెళ్ళిన పొగ నరాల్ని వేడెక్కించి ఒక రకమైన చురుకుదనాన్ని నరనరానికి కలిగిస్తూంది.

కిలకిల నవ్వుతూ అమ్మాయిల గుంపు తన ముందు వెళ్తూంది. అందమైన సీతాకోకచిలుకల సమూహంలా ఉంది. వాళ్ళ వెనకనే అబ్బాయిల గుంపు వస్తూంది. అమ్మాయిల మీద ఎవరో జోకేశారు. అందరూ పగలబడి నవ్వారు. రామారావ్ వాళ్ళ వంక చూశాడు.

"నవ్వండి బాగా నవ్వండి ఒకప్పుడు నేను నవ్వాను. ఒరేయ్! రాస్కెల్! నువ్వు నవ్వుతావురా అని ఆ దేవుడు నాకు కష్టాలిచ్చాడు, నవ్వండి కనీసం మీరైనా నవ్వండి."

సిగరెట్ గట్టిగా పీల్చాడు.

గంభీరంగా నడక సాగించాడు! వేలం పాటలో ప్రపంచాన్ని కొనేసి ప్రజలెలా ఉన్నారో చూద్దామని నడిచే రాజులా నడిచాడు.

మళ్ళీ పీల్చాడు సిగరెట్ దమ్ము!

ఒక కారు దుమ్ము రేపుకుంటూ వెళ్ళింది. ఆ కారులో అతి ఖరీదైన మనుషులున్నారు.

"ప్రపంచం మీదే రా బడుద్ధాయిలూ! ఎందుకంటే డబ్బు మీ దగ్గి రుంది ప్రపంచం మీ లాంటి వాళ్ళ చుట్టే తిరుగుతూంది. ఆఖరికి భూమీ గ్రహాలూ అన్నీ డబ్బు చుట్టే తిరుగుతున్నాయి." కసిగా అనుకున్నాడు.

మళ్ళీ నడక ప్రారంభించాడు.

"రేపటికి ఈ ప్రపంచంలో తాను ఉండడు. ఈ కుళ్ళు ప్రపంచానికి, ఈ నీచ ప్రపంచానికి, ఈ దవుర్భాగ్య, దరిద్ర ప్రపంచానికి ఇదే గుడ్‌బై నో నక్షత్రాల్లారా! నో పంచభూతల్లారా! సెలవ్" సిగరెట్ విసిరేశాడు.

రామారావ్ పట్టాల మీద నడుస్తున్నాడు. పట్టాలు పొడుగాటి పాముల్లా ఉన్నాయి. కింద కంకర రాళ్ళు గుచ్చుకుంటున్నాయి. 'తాను జీవితం నుంచి పారిపోతున్నాడు, కష్టాలకు, కన్నీళ్ళకు భయ పడ్డాడు. తాను పిరికి వాడు అసమర్థుడై జీవితాన్ని ఎదుర్కోలేక చావుతో పరిష్కారం పొందుతున్నాడు.

తాను పిరికివాడు!

ఆత్మహత్య మహా పాపం! ఆత్మహత్య మహా పాపం!

ఆత్మహత్యకు ధైర్యం కావాలి! అది మొండి ధైర్యం. చేతకాని ధైర్యం—సమస్యలతో పోరాడలేని ధైర్యం!

'ఒరేయ్, రామారావ్! చచ్చిపోతున్నావ్! కానీ, ఒరే! మళ్ళీ పుడతావురా! మళ్ళీ పుట్టి ఇంతకన్నా కష్టాలు పడతావురా—ఈ బతుకు నిన్ను వదలదు. మళ్ళీ చచ్చి, మళ్ళీ పుట్టి, మళ్ళీ చచ్చి, మళ్ళీ పుట్టి ఇంతకన్నా అగాధంలోకి జారిపోతావ్. మరి దీనికి పరిష్కారం! బతకటం ఒక్కటే! బతకటం ఒక్కటే!

ఈ రైలు పట్టాల మీద చనిపోతే తలా మొండెం వేరై నరాలు రక్తం, చితికిపోయిన తలతో అతి భయంకరంగా ఉంటుంది తన శవం. అమ్మో! ఆ దృశ్యం కళ్ళ ముందు తిరగ్గానే రామారావ్ కడుపులో తిప్పింది. చిన్నప్పుడు రైలు కింద చనిపోయిన వాళ్ళను చూశాడు. జ్వరం తెచ్చుకున్నాడు.

"అమ్మో! వద్దు! ఆ చావు తన కొద్దు! అంత భయంకరమైన చావు తన కొద్దు." ఇంతలో రైలు వస్తున్న శబ్దం. రామారావ్ పట్టాల మీద నుంచి లేచాడు. దూరంగా రైలు కనిపిస్తూంది.

రైలు దడదడ శబ్దం చేసుకుంటూ వస్తూంది.


రామారావ్ గుండె యమ స్పీడుతో కొట్టుకుంది. రైలు వెళ్ళిపోయింది. ఈ పాటికి తను చచ్చి పోయి ఉండేవాడు. తన శరీరం రక్తంతో నీచువాసన కొడుతూ ఉండేది.

అదృష్టం—తనూ చచ్చిపోలేదు.

రైలు పట్టాల మీద నుంచి లేచాడు. జేబులో రెండో సిగరెట్ ఉంది. 'తాను చచ్చి పోకూడదు. తాను బతకాలి.'

ఎక్కడో ఎవరింట్లోనో పసిపాప ఏడుస్తూంది.

'ఏడుస్తూ ఈ లోకానికి వచ్చాడు. పెరిగి పెద్ద వాడవుతాడు. డాక్టరో, కలెక్టరో, గుమాస్తా వెధవో అవుతాడు. చివరికి చచ్చిపోతాడు. పుట్టిన ప్రతి



వాడూ సహజంగా చచ్చిపోతాడు. కాని తాను అసహజంగా చచ్చి పోవాలను కున్నాడు. కానీ తనకు అంత ధైర్యం లేదు.

తాను అసమర్థుడు. పిరికివాడు.

తాను బతకాలి. అవును, తాను బతకాలి. ఈ ఇరుకు బతుకులో బతకాలి. తను కాకపోయినా తన కొడుకైనా గొప్పవాడవు తాడు. వాడి నీడలోనైనా సుఖంగా బతకచ్చు!

అవును—ఆ ఆశ తనలో ఉంది!

తను చచిపోతే తన లక్ష్మి, కొడుకు దిక్కులేని వాళ్ళవుతారు. అనాథలై పోతారు.

"అయ్యా, ధర్మం—బాబూ ధర్మం" అంటూ బిచ్చమెత్తుతారు. తనకారణంగా వాళ్ళు ఆ స్థితిలోకి రాకూడదు. రాకూడదు. తాను బతకాలి! విందుగా నూరేళ్ళు బతకాలి! కష్టాల్ని కౌగిలించు కుని, దార్భాగ్యాన్ని ధరించి, పేదరికాన్ని దిగమింగుతూ తను బతకాలి. తన వాళ్ళ కోసం బతకాలి!'

ఆ వూహ రాగానే అతను గుండె నిండా గట్టిగా గాలి పీల్చుకున్నాడు. గర్వంగా ఆకాశం వంకా, నక్షత్రాల వంకా చూశాడు.

'మిమ్మల్ని రోజూ చూస్తాను. మీకూ, నాకూ అనుబంధం తెగదు కాక తెగదు' అనుకున్నాడు.

'లక్ష్మీ! నేను చచ్చిపోను. మీ కోసం బతుకుతాను, లక్ష్మీ!' అని లక్ష్మి ఒడిలో తల దాచుకోవాలి.

అతను ఇంటి వైపు బయులుదేరాడు.

వీధిలో కుక్క అరిచింది. ఆకాశంలో నక్షత్రం జారింది.

ఇంటి తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. మెల్లగా తెరిచాడు—ఇల్లంతా చీకటిగా ఉంది. గదిలోకి వెళ్ళి లైటు వేశాడు.

పాదరసంలా కాంతి పరుచుకుంది.

అతని గుండె స్పందించింది.

'ఉత్తరం లక్ష్మి చదివిందా?'

"లక్ష్మీ, లక్ష్మీ!" ఎవరూ సమా ధానం చెప్పలేదు. ఇల్లంతా శ్మశానంలా ఉంది. మంచంమీద సుదర్శనం నిద్ర పోతున్నాడు.

"లక్ష్మీ!" కేకేశాడు.

బదులు లేదు.

వంట గది తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి. గది తలుపులు తెరిచాడు. లైటు స్విచ్ వేశాడు.

"లక్ష్మీ!"

ఆ గదిలో, ఆ వెలుగులో ఉరి పోసుకున్న లక్ష్మి శవం దూలానికి వేలాడు తూంది.

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ఉగాది నాటికల పోటీ

★ "రక్షాక్షి" ఉగాది సందర్భంగా ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక నిర్వహిస్తున్న నాటికలపోటీలో మూడు బహుమతులు ఉంటాయి. పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటికలలో అత్యుత్తమమైనవిగా నిర్ణయమయ్యే ఒక్కొక్క నాటికకు మూడేసి వేల రూపాయల బహుమతి ఉంటుంది. మరి ఏ ఇతర బహుమతులూ ఉండవు.

★ నాటికల ఇతివృత్తం ఏదైనా కావచ్చు. నిషిద్ధం లేదు. ఐతే వర్తమాన సామాజిక పరిణామాల నేపథ్యంలో ఆసక్తికరంగా ఉంటాయనుకొన్న ఇతివృత్తాలు వాంఛనీయం.

★ రచన వ్యావహారిక శైలిలోనే ఉండాలి.

★ పద్యాలూ, పాటలూ ఉంటే అవి సొంతమై ఉండాలి.

★ అనువాదాలు కానీ, అనుసరణలు కానీ కాకూడదు. పౌరాణిక, చారిత్రక ఇతివృత్తాలు ప్రామాణిక గ్రంథాలలోని మౌలిక విషయాలకు, చారిత్రక సత్యాలకు విరుద్ధం కాకూడదు. నాటిక సొంతమని హామీపత్రాన్ని జతపరచాలి.

★ రచనలలో ఏ మతవర్గం వారిని అగౌరవపరచే అంశాలు ఉండకూడదు. ఎవరి విశ్వాసాలను కించపరచ రాదు.

★ నాటికలు ప్రదర్శన యోగ్యంగా ఉండాలి. ప్రదర్శన కాలపరిమితి 45 నిమిషాలకు తక్కువ కాకుండా గంటకు ఎక్కువ కాకుండా ఉండాలి.

★ ఇంతకు ముందు ప్రదర్శించిన, ప్రసారం చేసిన నాటికలను పోటీకి పంపరాదు. రచనలు ఇంతకు ముందే పుస్తకరూపంలో వచ్చి ఉండకూడదు. ప్రచురణ కోసం కాని, ప్రసారం కోసం కాని పంపి ఉండకూడదు.

★ రచయితలు తమ నాటికలతో పాటు రంగస్థలం డిజైనుకూడా పంపాలి. రంగస్థల సామగ్రి జాబితాను వివరంగా రాయాలి.

★ బహుమతి పొందే రచనలను పత్రికలో ప్రచురించి మరెప్పుడైనా పునర్ముద్రించుకొనే హక్కు "ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక"కు ఉంటుంది. పుస్తకంగా ప్రచురించడం, ప్రదర్శించడం మొదలైన హక్కు రచయితకే ఉంటాయి.

★ ఈ పోటీకి రచనలు పంపేవారు తమ రచనలతోపాటు తమ ఫోటోను, సంగ్రహంగా జీవిత విశేషాలను రాసి పంపాలి.

★ రచనలను "ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ సెంటర్, దోమల్‌గూడా, హైదరాబాద్ 500 029" చిరునామాకు పంపాలి. కవరుపై 'ఉగాది నాటికల పోటీ'అని స్పష్టంగా రాయాలి.

★ బహుమతి పొందని, సాధారణ ప్రచురణకు సైతం స్వీకరించని రచనలను తిప్పి పంపడం కోసం తగినన్ని స్టాంపులు అంటించిన కవరును జత చేసి పంపాలి.

★ రచనలు అందినట్టు తెలియజేయాలని కోరే వారు సొంత చిరునామా రాసిన ఒక కార్డును పంపాలి.

★ 1984 ఫిబ్రవరి నెలాఖరులోగా మా కార్యాలయానికి అందేటట్టు పోటీకి రచనలను పంపాలి. తరవాత వచ్చే రచనలను పరిశీలనకు స్వీకరించడం సాధ్యపడదు.

★ పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటికలలో బహుమతికి అర్హమైన రచనలు రాలేదని భావించిన పక్షంలో బహుమతులను రద్దు చేసే హక్కు సంపాదకులకు ఉంటుంది.

★ పోటీ ఫలితాల విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

ఎడిటర్